## పీసీసీ అధ్యక్షుడు రేవంత్
# పెద్ద చీటర్

### రాజకీయ వ్యాపారుల ముఠాకు ఆయన బాస్
### పార్టీ జెండా మోసిన సీనియర్లకు అన్యాయం
### కాంగ్రెస్ అధిష్ఠానంపై మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ధ్వజం


దమ్మపేట: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

అశ్వారావుపేట, నవంబర్ 8: పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పెద్ద చీటర్ అని, రాజకీయ వ్యాపారుల ముఠాకు బాస్ అని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. అశ్వారావుపేటలోని ఓ ప్రైవేటు స్థలంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జెండా మోసిన సీనియర్ నాయకులకు టికెట్ ఇవ్వకుండా రేవంత్ అన్యాయం చేశారని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క, మాజీ మంత్రి జానారెడ్డి ఆహ్వానం మేరకు తాను రెండేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. అప్పటి నుంచి అశ్వారావుపేట నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేసుకుంటూ పని చేశానన్నారు. పార్టీ చేపట్టిన సర్వే ప్రకారం మొదట టికెట్లు ఇస్తామని ప్రకటించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాటతప్పారని మండిపడ్డారు. అశ్వారావుపేట నుంచి ప్రజామోదం లేని నేతకు టికెట్ ఇచ్చారన్నారు. తనను పార్టీలో చేర్చుకున్నప్పుడు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదన్నారు. తాను మునుగోడు ఉపఎన్నికలోనూ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం చేశానని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి రాజకీయ వ్యాపారం చేసే వ్యక్తులకే ప్రాధాన్యమిస్తున్నారని, అందుకే గాంధీభవన్‌లో ఇప్పటికీ నిరసనలు కొనసాగుతున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

#### డబ్బు, అహంకారం ముందు నిజాయితీ ఓడిపోయింది

దమ్మపేట, నవంబర్ 8: డబ్బు, అహంకారం ముందు నిజాయితీ ఓడిపోయిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు తాటి వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన బుధవారం మందలపల్లిలోని తన నివాసంలో అనుచరులు, పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్టీలో తనకు జరిగిన అన్యాయాన్ని కార్యకర్తలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో చేరిన నాటి నుంచి పార్టీ కోసం ఎంతో కష్టపడ్డానని అన్నారు. అశ్వారావుపేట టికెట్‌ను తనకు కనీసంగా కూడా చెప్పకుండా, పార్టీతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తికి ఇవ్వడాన్ని అవమానంగా భావిచానని, అందుకే రాజీనామా చేశానని వివరించారు. భవిష్యత్ రాజకీయాలపై చర్చించారు. బీఆర్‌ఎస్‌లోకి వెళ్లేందుకు అందరూ సిద్ధమయ్యారు. ఈ నెల 13న దమ్మపేటలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్‌ఎస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. పొట్టా రాజులు, చెరుకూరి రవి, సంకా కృపాకర్, బూరుగుపల్లి కృష్ణారావు, పెద్దారపు నాగరాజు, రామకృష్ణ, అజీమ్, ఇనపనూరి రాంబాబు, మురహరి రాంబాబు, బయ్య సత్తిబాబు, ముస్తఫా, రామారావు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను, బీజేపీని ఓడించాలి : సీపీఎం


మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్

చండ్రుగొండ, నవంబర్ 8: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా నాయకుడు కొండపల్లి శ్రీధర్ తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చండ్రుగొండలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. పొత్తు ధర్మాన్ని కాంగ్రెస్ పాటించలేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర ధరలు పెరిగాయన్నారు. నాయకులు ఐలూరి రామిరెడ్డి, విప్పర్ల పెద్దవెంకటేశ్వర్లు, రామడుగు వెంకటాచారి, రాయి రాజా, చల్లపల్లి రాజా, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి డాక్టర్ ప్రసాదరావు రాజీనామా

అశ్వారావుపేట టౌన్, నవంబర్ 8: బీజేపీకి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ భూక్యా ప్రసాదరావు రాజీనామా చేశారు. ఆయన బుధవారం తన ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. రాజీనామా పత్రాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి పంపినట్లు చెప్పా. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి 2018 నుంచి ఎంతగానో కృషి చేశానని అన్నారు. జనసేన పార్టీతో పొత్తు విషయాన్ని రాష్ట్ర నాయకత్వం తమకు తెలుపలేదని, అశ్వారావుపేట నియోజకవర్గంలో జనసేనకు మద్దతు ప్రకటించిందని, దీనిని తాను జీర్ణించుకోలేకపోయానని అన్నారు. భవిష్యత్తు కార్యాచరణపై తన అనుచరులతో చర్చించిన తర్వాత ప్రకటిస్తానని అన్నారు. బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా నిరంజన్‌దాస్ మాట్లాడుతూ.. తాను కూడా బీజేపీకి రాజీనామా చేసినట్లు చెప్పారు.

## నాలుగు నామినేషన్లు దాఖలు

అశ్వారావుపేట, నవంబర్ 8: అశ్వారావుపేట అసెంబ్లీ స్థానానికి బుధవారం నలుగురు నామినేషన్ వేశారు. అబాద్ పార్టీ నుంచి వాసం పోలయ్య, గోండ్వాన దండకారణ్య పార్టీ నుంచి ఊకే రవి, కాంగ్రెస్ నుంచి జారే ఆదినారాయణ, అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ నుంచి పద్దం వెంకటరమణ నామినేషన్ దాఖలు చేశారు.

## రూ.1.50 లక్షలు సీజ్

అశ్వారావుపేట, నవంబర్ 8: పోలీసులు రూ.1.50లక్షలు స్వాధీనపర్చుకుని సీజ్ చేశారు. ఏపీలోని ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం అప్పలరాజుగూడెం గ్రామస్తుడు కె.సత్యనారాయణ కారులో బుధవారం హైదరాబాద్ వెళ్తున్నారు. స్థానిక చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు ఆయన కారును తనిఖీ చేశారు. ఆధారాలు చూపని రూ.1.50లను సీజ్ చేశారు.

## బూసురాయికి కేంద్ర వైద్య బృందం

ఆళ్లపల్లి, నవంబర్ 8: మండలంలోని పెద్ద వెంకటాపురం పంచాయతీ బూసురాయి గ్రామాన్ని కేంద్ర వైద్య బృందం (ఐసీఎంఆర్) బుధవారం సందర్శించింది. మలేరియా మాస్ స్క్రీనింగ్ టెస్టులు, వైద్య శిబిరం నిర్వహించింది. చిన్న పిల్లలకు టీకాలు వేసింది. ఈ బృందంలో పాండే, మణీష్, నవీన్ ఉన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ స్పందన, అదనపు మలేరియా అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, డీఐవో బాలాజీనాయక్, ఆళ్లపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేవంత్, ఉల్వనూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.


దమ్మపేట: కార్పెంటర్స్ కాలనీలో ఇంటింటి ప్రచారం


దమ్మపేట: బ్రహ్మంగారి టెంపుల్ వీధిలో ప్రచారం

# బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

### ఎమ్మెల్యే, అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు


అన్నపురెడ్డిపల్లి: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మెచ్చా

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 8: బీఆర్‌ఎస్ గెలుపుతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే, అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు ఆధ్వర్యంలో అబ్బుగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కూరం రాము, కృష్ణారావు.. బుధవారం మెచ్చా సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఈ నెల 13న దమ్మపేటలో సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయాలని కోరారు. దమ్మపేట మండలంలోని తాటి సుబ్బన్నగూడెంలో మెచ్చా ఇంటి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు, నాయకులు కొత్తూరు వెంకటేశ్వరరావు, జంగాల ఉమామహేశ్వరరావు, ప్రసాద్, రాంబాబు, వెంకన్న, హుస్సేన్ పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 8: మండలంలోని అన్నపురెడ్డిపల్లి, నామవరం గ్రామాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు కొండేటి నరసింహ, చల్లా రాంబాబు, పుల్లారావు, ఏసుబాబు, వెంకటేశ్వర్లు, రాంబాబు పాల్గొన్నారు.

దమ్మపేట, నవంబర్ 8: స్థానిక అర్బన్ కాలనీలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు-నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దారా యుగంధర్, యార్లగడ్డ బాబు, యార్లగడ్డ శ్రీను, అబ్దుల్ జిన్నా, శ్రీరాముల సత్యనారాయణ, కొలూరి నాగయ్య, వంకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట, నవంబర్ 8: స్థానిక కార్పెంటర్స్ కాలనీ, బ్రహ్మంగారి టెంపుల్ వీధిలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే రేగా కాంతారావు చేసిన అభివృద్ధిని వివరించారు. ఆయనను మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.


అన్నపురెడ్డిపల్లి: ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు


దమ్మపేట: అర్బన్ కాలనీలో నాయకుల ప్రచారం

## సమాచారం మాకు.... బహుమతి మీకు


వాల్ పోస్టర్ అంటిస్తున్న ఎస్సై రాజశేఖర్, సిబ్బంది

గుండాల, నవంబర్ 8: 'సమాచారం మాకు.. బహుమతి మీకు' పేరుతో మావోయిస్టుల ఫొటోలు ముద్రించిన వాల్ పోస్టర్లను మండలంలోని గుండాల, సాయనపల్లి, చిన్న వెంకటాపురం, ఆడవిరామవరం, దామరతోగు గ్రామాల్లో ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం అంటించారు. ప్రజలతో ఎస్సై మాట్లాడుతూ... ఈ పోస్టర్లలో ఉన్న మావోయిస్టుల సమాచారం ఇచ్చిన వారికి బహుమతి ఇస్తామని, వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

## ఆయుర్వేద వైద్య శిబిరం

అశ్వాపురం, నవంబర్ 8: మండలంలోని కుర్నపల్లి కొత్తూరులో బుధవారం ఆయుర్వేద వైద్య శిబిరాన్ని డాక్టర్ అరుణ నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులు ఇచ్చారు. పారా మెడికల్ సిబ్బంది జి.రాధిక, అంగన్‌వాడీ టీచర్ వెంకటరమణ పాల్గొన్నారు.

## బంగారపు గొలుసు దోపిడీ

సత్తుపల్లి రూరల్, నవంబర్ 8 : మహిళ మెడలో గొలుసు దోపిడీ ఘటన పట్టణంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గీతమ్స్ కళాశాల రోడ్‌లో నివాసముంటున్న తాళ్లూరి నాగమణి బ్యాంకు పని నిమిత్తం సెంటర్‌కు వచ్చి మధ్యాహ్నం తిరిగి వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని నాలుగు కాసుల బంగారు గొలుసును దోపిడీ చేసి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ మోహన్‌బాబు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.